క్లుప్తంగా

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



పామర్రు: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగను పురస్కరించుకుని స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్‌కు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు రాఖీలు కట్టారు. రాఖీ పండుగ నేపథ్యంలో బుధవారం గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకుంది. అన్నా చెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. పామర్రు వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీలు పల్లికొండ రత్నకుమారి, భోగిన వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరమ్మలు స్థానిక ఎమ్మెల్యే కైలే నివాసానికి చేరుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపి, రాఖీలను కట్టారు. అనంతరం ఎమ్మెల్యేకు మిఠాయిలను తినిపించి, ఆశీస్సులు పొందారు.

ఉత్సాహంగా రక్షాబంధన్



కైకలూరు: రక్షాబంధన్(రాఖీ పౌర్ణమి) సందర్భంగా అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు రాఖీలు కట్టుకుని ప్రేమబంధాన్ని బుధవారం చాటుకున్నారు. దుకాణాల్లో రాఖీలకు డిమాండ్ పెరిగింది. పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు రాఖీలు కట్టుకుని సంతోషం వ్యక్తం చేశారు. అదే విధంగా పలువురు ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టారు.

నేత్రదానంతో అంధత్వాన్ని నివారించండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ రమేష్‌కుమార్



మచిలీపట్నంటౌన్: ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి అంధత్వాన్ని నివారించాలని జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జీజీహెచ్‌లోని సూపరింటెండెంట్ చాంబర్‌లో బుధవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నేత్రదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు భారత ప్రభుత్వం నేత్రదాన పక్షోత్సవాలుగా నిర్ణయించిందని చెప్పారు. దీనిలో భాగంగా నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ నాగజ్యోతి, జీజీహెచ్ నేత్ర విభాగాధిపతి డాక్టర్ జి.భానుమూర్తి, నేత్ర వైద్య విభాగం వైద్యులు శిరీష, పూజిత,పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరుల సమస్యలను పరిష్కరించాలి

పామర్రు: దస్తావేజు లేఖరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పామర్రు మండల దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లేఖరులు మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న కార్డు 20 వల్ల దస్తావేజు లేఖరులకు తీవ్రమైన నష్టం ఏర్పడుతుందన్నారు. దీని వల్ల దస్తావేజు లేఖరితో పని ఉండదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైమ్ 20 సెప్టెంబర్‌లోగా అమలులోకి వస్తుందని రిజిస్ట్రేషన్ అధికారులు తెలిపారన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, అర్జీని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పామర్రు మండల దస్తావేజు లేఖరులు గుజవర్తి వెంకటేశ్వరరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటరెడ్డి, గోవర్ధనరావు, కానుకొల్లు ఉదయ్‌కుమార్, చీలి వెంకటేశ్వరరావు, దోనే శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

న్యాయమూర్తి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక డీఎంఎస్ ఎస్‌వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో డ్రగ్స్ వాడకం, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయని చెప్పారు. విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని, విద్యకు ప్రాధాన్యత ఇచ్చి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలని చెప్పారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. చట్టాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా విద్యార్థులు ప్రవర్తించాలన్నారు. వాహనాలను వేగంగా నడపటం, రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించటం చట్టరీత్యా నేరమన్నారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య మాట్లాడారు. ఎస్‌ఐ సత్యనారాయణరావు, ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఎంవీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ బి. నాగజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి రాటా ప్రతిష్ట



గుడివాడలో రాటా ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

గుడివాడటౌన్: వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని స్థానిక ఏడో వార్డులోని కొత్తపేటలో వేం చేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ సమేత బాల గణపతి స్వామి వారి దేవస్థానంలో బుధవారం భక్తిశ్రద్ధలతో రాటా ప్రతిష్ట జరిగింది. స్వామివారి నవరాత్రి మహోత్సవాలు పనులు ప్రారంభ సూచికగా రాటా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్ 18 నుంచి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని, వేడుకల్లో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు పి.దుర్గా మల్లేశ్వర రావు, కమిటీ సభ్యులు టి.కోటేశ్వరరావు, టి.మాణిక్యం, ఎస్.బసవ నాగన్న, ఎస్.దత్తాత్రేయులు, టి.త్రిమూర్తులు, ఎస్.సుబ్బరాయుడు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సంఘాలు సంసిద్ధం కావాలి

గుడివాడటౌన్(నందివాడ): గ్రామాల్లోని పేద ప్రజలు ఆర్థికంగానూ, సామాజికంగా అభివృద్ధి చెందడానికి గ్రామ సంఘాల ప్రతినిధులు సంసిద్ధం కావాలని జిల్లా యాంకర్ పర్సన్ కె.సుబ్బారావు అన్నారు. నందివాడ మండల స్త్రీ శక్తి భవన్‌లో నాలుగు రోజుల శిక్షణ శిబిరాలను బుధవారం ఆయన ప్రారంభించారు.

అవగాహన అవసరం..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ గ్రామాలుగా ఉండాలంటే వాటిలో సౌకర్యాలు, వ్యక్తిత్వం, కుటుంబ పరంగా, గ్రామపరంగా, రానున్న ఐదున్నర సంవత్సరాల్లో ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే అంశాలపై నాయకత్వానికి అవగాహన ఉండాలన్నారు. నైపుణ్య శిక్షణ, జీవనోపాధులు, ఆరోగ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, బీమా, సాంకేతిక పరిజ్ఞానం ఈ అంశాలపై అవగాహన అవసరమన్నారు. శిక్షణ శిబిరంలో 9 మండలాలకు చెందిన ఏపీఎంలతో పాటు 33 గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పలు అంశాలను వివరించామని ఆయన తెలిపారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నాగాయలంక, ఘంటసాల, గుడ్లవల్లేరు, బంటుమిల్లి, పెదపరిపూడి, గన్నవరం, తోట్లవల్లూరు, కంకిపాడు, ఏపీఎంలు, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

గిడుగు రామమూర్తికి ఘన నివాళి



రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

గుడివాడటౌన్: మాతృభాషను మరచి, పరాయి భాష వెంట పరుగులు తీయడం తగదని ఏఎన్ఆర్ కళాశాల విశ్రాంత చరిత్ర అధ్యాపకుడు కె.గాంధీబాబు తెలిపారు. స్థానిక శ్రీనివాస సెంటర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం గిడుగు రామమూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని గాంధీబాబు అన్నారు. భాష ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేయటానికి రామమూర్తి పంతులు చేసిన సేవలను ఆయన వివరించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి పట్టణ కన్వీనర్ ఎల్.సురేంద్ర, అవిరినేని వెంకటేశ్వరరావు, సీహెచ్ రూప, వై.కోటేశ్వరరావు, పీటర్, కె.సురేష్ పాల్గొన్నారు

కేంద్ర విధానాలపై 4 వరకు నిరసన కార్యక్రమాలు



నిరసన కార్యక్రమాల జాబితాను విడుదల చేస్తున్న నాయకులు

గుడివాడటౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్సీపీ రెడ్డి కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల జాబితాను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్సీపీ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వలన పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగటం, తద్వారా వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు పెరిగాయన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోవడం విచారకరమని చెప్పారు. సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ విధానాలపై చేపట్టే నిరసన కార్యక్రమాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమాల జాబితాను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.రజిని, సమీర్, ప్రభుదాస్, ఎం.మరియదాస్ పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తాచాటిన తలగడదీవి హైస్కూల్ బాలికలు



ప్రథమ స్థానంలో నిలిచిన తలగడదీవి బాలికల జట్టు

నాగాయలంక: కబడ్డీ పోటీల్లో తలగడదీవి బాలికల హైస్కూల్ జట్టు సత్తాచాటి విజేతగా నిలిచింది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో ఎనిమిది మండలాల స్థాయిలో అవనిగడ్డలో క్రీడా పోటీలు జరిగాయి.తలగడదీవి ఉన్నత పాఠశాల బాలికల జట్టు నాగాయలంక ఉన్నత పాఠశాల ప్లస్ బాలికల జట్టు ఫైనల్ పోటీలో తలపడ్డాయి. తలగడదీవి బాలికల జట్టు విజేతగా నిలిచింది. నాగాయలంక బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. తలగడదీవి విద్యార్థిని ఎం.రోజా లాంగ్ జంప్‌లో, నాగాయలంక విద్యార్థి కె.హరీష్ 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలకు బుధవారం ఆయా పాఠశాలల్లో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బండ్రెడ్డి శివరామ ప్రసాద్, వీఎస్‌వీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు, సీహెచ్‌వీ సుబ్బారావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.సుబ్బారావు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రాప్‌అవుట్స్ విద్యార్థులకు అడ్మిషన్లు



డ్రాప్‌అవుట్స్ విద్యార్థుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు

మండవల్లి: ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో డ్రాప్‌అవుట్స్‌ను గుర్తించి వారిని స్కూల్, కళాశాలల్లో చేర్పించేందుకు మిషన్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని మండవల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా మండవల్లి, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, గన్నవరం, పెరికెగూడెం గ్రామాల్లో చదువు ఆపేసిన విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. వారిని మళ్లీ కళాశాలలకు పంపించాలని కోరగా వారి నుంచి సానుకూలత వ్యక్తమైందన్నారు. మిగిలిన వారితో మరోసారి మాట్లాడతామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, ప్రభయ్య, శివకుమారి, మైనర్‌బాబు, కిరణ్‌కుమార్ బాబా, సుబ్రహ్మణ్యం, దివాకర్ పాల్గొన్నారు.

8న అమ్మ వారికి గాజుల అలంకరణ

గుడివాడటౌన్: స్థానిక గౌరీ శంకర్‌పురంలో వేం చేసి ఉన్న శ్రీ గౌరీశంకర్ స్వామి వారి దేవస్థానంలో శ్రావణ మాసం నాలుగో శుక్రవారం పురస్కరించుకొని సెప్టెంబర్ 8వ తేదీన అమ్మవారికి ప్రత్యేక గాజుల అలంకరణ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈ ఓ నటరాజన్ షణ్ముఖం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 10 గంటల లోపు భక్తులు అమ్మవారికి గాజులు సమర్పించాలని ఆయన కోరారు.

సరళీకృత విధానంలో విద్యాబోధన చేయాలి

నిడుమోలు(మొవ్వ): తెలుగు సబ్జెక్టు అభ్యసనంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు సరళీకృత విధానంలో బోధన చేయాలని నిడుమోలు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, హెచ్‌ఎం చలమలశెట్టి అన్నపూర్ణమ్మ సూచించారు. మొవ్వ, పామర్రు, గూడూరు మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులను మొవ్వ మండలం నిడుమోలు జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్ ఏ.పోతురాజు ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మరో రిసోర్స్‌పర్సన్ పి.కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో గ్రూప్ డిస్కర్షన్ ద్వారా పలు సందేహాలను నివృత్తి చేశారు.

రూ.16 లక్షలతో గ్రంథాలయ నిర్మాణం

పెనమలూరు: వణుకూరులో గ్రంథాలయ భవనం రూ. 16 లక్షలతో నిర్మించనున్నామని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. వణుకూరు గ్రామం జానకిరామ్ నగర్‌లో గ్రామ పంచాయతీ కేటాయించిన 4 సెంట్ల స్థలంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి జమల పూర్ణమ్మ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల ఏర్పాటుకు ముందుకు వచ్చి నిధులు మంజూరు చేస్తుందన్నారు. వణుకూరు గ్రామంలో చాలా సంవత్సరాలుగా గ్రంథాలయ భవన నిర్మాణం ప్రతిపాదన పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం నేడు నిధులు మంజూరు చేయటంతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టామని వివరించారు. జిల్లాలో స్థలాలు కేటాయిస్తే మరిన్ని గ్రంథాలయాల భవనాల నిర్మాణం చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గద్దల రాజా, వైఎస్సార్ సీపీ నేత చక్క గోపీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి కే.లక్ష్మయ్య, ఏఈ శ్రీనివాసరావు, వార్డు సభ్యులు సీహెచ్.దుర్గారావు,కే.శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారిణి ఎస్.భారతి,గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జిల్లాలో లింగ నిర్ధారణ ఎంపిక నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి తెలిపారు. బాపులపాడులోని స్కానింగ్ కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ప్రైవేట్ స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని స్పష్టంచేశారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా పీసీపీఎన్డీటీ చట్టం పరిధిలో నమోదు కావాలని ఆదేశించారు. ఏ స్కానింగ్ కేంద్రంలోనైనా గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే ఐఎంఏ గుర్తింపు సైతం రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామని తేల్చిచెప్పారు. జిల్లాలో తక్కువ లింగ నిష్పత్తి కలిగిన ప్రాంతాలను గుర్తించి, ఆ ఏరియాలోని స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాల వివరాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయానికి తెలిపాలని కోరారు. సమాచారం అందిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ఆరోగ్య విద్య బోధకుడు బి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి



చెక్కు అందజేస్తున్న పీడీ శివరామ్‌ప్రసాద్, బ్యాంక్ మేనేజర్లు

గుడివాడరూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని డీఆర్డీఏ పీడీ పి.శివరామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని నూజెళ్ల గ్రామానికి చెందిన ముల్లేటి కళ్యాణికి పీఎంఈజీపై పథకం కింద రోల్డ్‌గోల్డ్ విగ్రహాల తయారీ యూనిట్ కోసం కెనరా బ్యాంక్ అంగలూరు బ్రాంచ్ నుంచి మంజూరైన రూ.9.45 లక్షల సబ్సిడీ రుణం చెక్కును పీడీ బ్యాంక్‌లో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద మహిళలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నాయన్నారు. అందులో భాగంగానే ప్రవేశపెట్టిన పీఎంఈజీపై పథకం వారికి వరం లాంటిదన్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు సబ్సిడీతో రుణాలను మంజూరు చేస్తున్నామని చెప్పారు. అలా పొందిన లబ్ధిదారులు వ్యాపారాలు చేసుకుని సకాలంలో రుణం చెల్లించడమే కాకుండా ఆర్థికంగా జీవితంలో ముందుకు వెళ్లాలన్నారు. బ్యాంక్ మేనేజర్ విజయకుమార్ మాట్లాడుతూ.. రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లిస్తే మరిన్ని రుణాలను ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ డీటీ సుందరరావు, ఏపీఎం సాంబశివరావు, జిల్లా సమైక్య అధ్యక్షురాలు టి.నాగమునిమ్మ, సీసీ కె.నాగేశ్వరి, నూజెళ్ల, చిరిచింతల వెలుగు మిత్రాలు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి పథకంపై రైతులకు శిక్షణ



రైతులకు శిక్షణ ఇస్తున్న అధికారులు

అయ్యంకి(మొవ్వ): మేలైన వరి విత్తనాలను వినియోగించటంతో అధిక దిగుబడులను సాధించవచ్చునని మచిలీపట్నం జిల్లా వనరుల కేంద్రం డిస్ట్రిక్ కోర్డినేటర్ కె.జ్యోతిరమణి రైతులకు సూచించారు. మండల పరిధిలోని అయ్యంకి గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరమణి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలో నాణ్యమైన విత్తనాలను నిల్వ చేసుకుని, వాటిని విత్తనాలుగా వినియోగించుకోవాలన్నారు. కలుపు నివారణకు నామినీ గోల్డ్, పురుగు నివారణకు క్లోరోపైరీఫాక్స్ 50 ఈసీ ఉపయోగించాలని సూచించారు. కలుపు యాజమాన్యం, ఎలకల నివారణ, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డి.సుధారాణి, ఏడీఏ ఎస్.శ్యామల, ఏఓ కే.శివప్రసాద్, వీఏఏ కె.రాజేష్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుడికి ఎమ్మెల్యే డీఎన్నార్ పరామర్శ



నెహేమియాను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, తామరకొల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు కుర్మా నెహేమియా అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్నా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆయన నివాసానికి వెళ్లి బుధవారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు సర్పంచ్ భట్రాజు శివాజీ ఉన్నారు.